క్లుప్తంగా

ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: సజ్జలదిన్నె సమీపంలో (పాత బ్రిడ్జి) వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలను కోరారు. జిమ్‌లో వ్యాయామ పరికరాలను ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ సీఐ ఆనందరావు ఉన్నారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని తహసీల్దారు రమాదేవి పేర్కొన్నారు. సిబ్బందిని పంపించి అధికారులు గైర్హాజరైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నెట్టికంటి ఆంజనేయుడికి వెండి విరాళం

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి అనంతపురానికి చెందిన సమంత్ అనే భక్తుడు 1.416 కేజీల వెండితో పాటు 43 తులాల వెండి తమపాకుల హారన్ని ఆలయ ఆధికారులు అందజేశారు. ఆదివారం సుమంత్ కుటుంబ సభ్యులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

నేడు భీమా పార్కు ప్రారంభం

గుంతకల్లుటౌన్: పట్టణ శివార్లోని హనుమాన్ జంక్షన్ రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి విగ్రహ ఆవిష్కరణ, భీమా పార్కుల ప్రారంభోత్సం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు బుగ్గన, గుమ్మనూరు జయరామ్, ఉషశ్రీచరణ్‌తో పాటు అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ పెద్దలు హాజరవుతున్నట్లు ఆయన తెలియజేశారు. ఇదిలా ఉండగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం గుత్తికి రానున్నారు. డోన్ ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి స్వగృహంలో తేనేటి విందులో పాల్గొననున్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి టౌన్: స్థానిక రోటరీ క్లబ్ భవనంలో ఆదివారం 52 మంది పేద దివ్యాంగులకు రోటరీ క్లబ్ సభ్యులు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పేద దివ్యాంగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రతి నెలా రూ.400 విలువ చేసే నితావసర వస్తువులను పంపిణీ చేస్తున్న క్లబ్ అధ్యక్షుడు షాకీర్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కిశోర్, సభ్యులు మద్దిలేటి, బాబు, నాగేంద్ర, మాబు, బాలసుబ్రమణ్యం, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో విజిలెన్స్ కమిషనర్

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో విజిలెన్స్ డిపార్టుమెంట్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పేరిట ప్రత్యేక పూజాలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

గృహసారథులే విజయ సారథులు

- పేదరిక నిర్మూలన జరగాలంటే మళ్లీ జగనన్నే రావాలి
- గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లే రేపటి విజయ సారథులని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డులో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 23 వార్డులకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన మూడున్నరేళ్లలో సీఎం వైఎస్.జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి, వార్డు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి తెలియజేయాలన్నారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యావసరాల పెరుగుదల అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలో నివని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్న ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు, టీడీపీ పాలనలోని వైఫల్యాలను వివరించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో పూర్తిగా పేదరిక నిర్మూలన జరగాలంటే మళ్లీ జగనన్నే రావాలని, అందుకు గృహసారథులు సైనికుల్లా పని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్. మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప, పార్టీ పట్టణాధ్యక్షుడు బి.సుంకప్ప, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్లు రామాంజినేయులు, ఖలీల్, కౌన్సిలర్లు మెహరున్నీసా, మహాలక్ష్మి, చాముండేశ్వరి, విద్యారాణి, కుమారి, ప్రభాకర్, చాంద్‌బాష, సుధాకర్, సుమోబాష, కోఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌ఛార్జులు మాచర్ల శివ, బ్రహ్మ, సంపత్, సుంకప్ప, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు అహమ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాబు వల్లే నందమూరి కుటుంబం నాశనం

అనునిత్యం అధికార ం కోసం వెంపర్లాడే చంద్రబాబు తన స్వార్థం కోసం ఎన్టీఆర్ కుటుంబాన్ని రాజకీయంగా నాశనం చేశారని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆరోపించారు. పక్కా పథకం ప్రకారమే నందమూరి కుటుంబాన్ని రాజకీయంగా అణచివేసిన దుర్మార్గుడు చంద్రబాబని ఆయన విమర్శించారు. చంద్రబాబు పెట్టిన మానసికక్షోభ, వెన్నుపోటు కారణంగానే ఎన్టీఆర్ మరణించారని ఆయన ఆరోపించారు. ఎన్టీఆర్ ఆకస్మిక మృతితో పాటు ఆయన తనయుడు హరికృష్ణ రోడ్డు ప్రమాద ఘటనలపై ఆయన అభిమానులకు అనేక అనుమానాలు న్నాయని, వారి మరణాలపై సీబీఐ చేత విచారణ చేయించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని డిమాండ్ చేశారు.

నారాయణ స్వామీ.. నమోస్తుతే!

పెద్దపప్పూరు: మాఘమాసం మూడవ ఆదివారాన్ని పురస్కరించుకుని అశ్వత్థం తిరునాల వైభవంగా జరిగింది. జిల్లా నుంచే గాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో క్షేత్రం కిటకిటలాడింది. ఉదయం నారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వరుడు, శింగరబట్లు, గణపతి మూలవిరాట్‌లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెన్నానదిలో ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను తెప్పలతోపాటు అందుబాటులో ఉంచారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రమణ్యంతోపాటు భక్తులు అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. గార్లదిన్నె గ్రామానికి చెందిన జొన్నకుంట వెంకట క్రిష్టారెడ్డి, సర్పంచు హేమసుందర్ రెడ్డి సొంత ఖర్చులతో తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు.



వెండి కవచ అలంకరణలో నారాయణ స్వామి

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

తిరునాల సందర్భంగా నారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వరులను ఆదివారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే జొన్నగడ్డల పద్మావతి దర్శించుకున్నారు. వారు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. ఇదిలా ఉండగా తాడిపత్రి నుంచి 30 ప్రత్యేక సర్వీసులు నడిపినట్లు డీఎం శంకర్ తెలిపారు.



నారాయణస్వామిని దర్శించుకుంటున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పూజలు నిర్వహిస్తున్న శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పరవశించిన భక్తజనం



రథోత్సవానికి హాజరైన భక్తులు



రథం వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, నాయకులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుని తిరునాలలో భాగంగా ఆదివారం జరిగిన రథోత్సవంలో భక్తులు స్వామిని దర్శించుకుని పరశించిపోయారు. రథోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులతో గ్రామ పురవీధులు నిండిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దేవరకొండపైకి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తిరునాలకు మండల కేంద్రం చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబండ్లు ట్రాక్టర్లపై వచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తినుబండారాలు, గాజులు, ఆట వస్తువుల దుకాణాల వద్ద కొనుగోళ్లతో భక్తుల సందడి నెలకొంది.



బొమ్మల దుకాణం వద్ద పిల్లల సందడి



గాజుల అంగడి వద్ద మహిళల హడావుడి

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి

తాడిపత్రి టౌన్: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం సాయంత్రం సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి ఘనంగా జరిగింది. తాడిపత్రి సంఘ్ పరివార సభ్యులు రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాదరక్షలు తయారు కార్మికులను సన్మానించారు. సంఘ్ పరివార సభ్యులు కత్తి రామచంద్రారెడ్డి, చిరంజీవులు, లక్ష్మీనారాయణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగనాథరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్రచేడు నుంచి 'ప్రజా సంక్షేమ యాత్ర'

పెద్దవడుగూరు : చిత్రచేడు నుంచి సోమవారం ఉదయం 8 గంటలకు ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి తెలిపారు. చిత్రచేడు నుంచి చిట్టూరు, గంజిగుంటపల్లి, నాగలాపురం, వీరన్నపల్లి వరకూ పాదయాత్ర సాగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



రాఘవేంద్రస్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు

తాడిపత్రి టౌన్: స్థానిక గాజుల క్రిష్టప్పవీధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా జరిగింది. పుష్యమాసం పూర్ణిమ పురస్కరించుకుని వ్రతాన్ని నిర్వహించారు. రమా సహిత సత్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను జల, క్షీరాభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో ఆలంకరించారు. అనంతరం భార్యభర్తలు, మహిళలు వ్రతం నిర్వహించారు. ఇదిలా ఉండగా పట్టణంలోని శివాలయం వీధిలోని సాయిబాబా ఆలయంలో మాఘ పూర్ణిమను పురస్కరించుకుని సాయి వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

తాడిపత్రి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. యాడికి మండలం తూట్రాళ్లపల్లికి చెందిన జయరామిరెడ్డి పులివెందులకు ఓ వివాహానికి హాజరై తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో తాడిపత్రి – కడప ప్రధాన రహదారిపై బోడాయిపల్లికి చెందిన చిన్నపరెడ్డి అనే వ్యక్తి అతివేగంగా బైక్‌పై వచ్చి జయరామిరెడ్డి బైక్‌ను ఢీ కొట్టాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన జయరామిరెడ్డిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం తీసుకెళ్లారు.

ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: కనంపల్లి క్రాస్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. చియ్యేడుకు చెందిన విశ్వనాథ్, అనంతపురానికి చెందిన దేవేంద్ర కల్లూరు నుంచి బైక్ అనంతపురం బయలుదేరారు. కనంపల్లి క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్ ఢీకొనింది. ఘటనలో గాయపడిన ఇద్దరినీ 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుత్తి: పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన రామన్న బైక్‌పై తొండపాడుకు వెళుతుండగా వెనుక నుంచి ఆటో ఢీ కొనింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామన్నను స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సింగరప్ప స్వామి తిరునాల



ప్రత్యేక అలంకరణలో సింగరప్పస్వామి

గార్లదిన్నె: కల్లూరులో క్షేత్రపాల కొండపై వెలసిన సింగరప్పస్వామి తిరునాల ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణం సమీపంలో పెన్నా నదిలో ఉత్తర, దక్షిణం నీరు పారడంతో స్నానం చేసి స్వామిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా కోటంక తిరునాల



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



స్వామివారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజామున శ్రీవారికి మహాన్యాసపూర్వక, ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంత్రపుష్పం, మంగళహారతి గావించారు. అనంతరం శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీవారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వీటిని తిలకించడానికి భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. 108 సాలగ్రామ శివలింగాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. స్వామి మూల విరాట్ వద్ద ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకొని భక్తిశ్రద్ధలతో సేవించారు. 35 అడుగుల సుబ్ర హ్మణ్యస్వామి, నాగుల పడగ, నంది రాతి విగ్రహాలకు పూజలు చేశారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు, ఈఓ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గాజులు, తినుబండారాల అంగళ్ల వద్ద సందడి నెలకొంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



శ్రీవల్లీ దేవసేనసుబ్రహ్మణ్యేశ్వర విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మిన్న

గుంతకల్లు: అన్ని దానాల్లో కన్నా అన్నదానం చాలా గొప్పదని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం కసాపురంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిత్యాన్నదనం కార్యక్రమాన్ని చేపట్టిన తలారి పరుశురాముడును అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న పరుశురాముడు దంపతులు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

గుత్తి రూరల్: జక్కలచెరువులో సీతారాముల విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, యాగాలు చేసి సీతారాముల విగ్రహాలను ప్రతిష్టించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అర్చకులు స్వామి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యేకి అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీం, రంగస్వామి, రాజన్న, సర్పంచ్ సుహాసిని, కౌన్సిలర్లు వరద, నరేష్, రమణ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతకల్లప్ప స్వామి కల్యాణమండపంలో జరిగిన భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఏసురత్నం, జిల్లా కార్యదర్శిగా బి.సురేష్, ఉపాధ్యక్షులుగా చిక్కన్న, రవీంద్ర, సహాయ కార్యదర్శిగా సురేష్‌బాబు, కోశాధికారిగా మారుతితో పాటు 9 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.